క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో జీవీఎంసీ కమిషనర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సాయికాంత్‌వర్మ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

అశ్లీల నృత్య ప్రదర్శనలపై కేసు నమోదు

పరవాడ : లంకెలపాలెం శివారు గెంజిపేట గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవాలను పురస్కరించుకుని అశ్లీల నృత్యాలు చేస్తున్న ఓ మహిళ, నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పరవాడ ఎస్ఐ సిరపరపు సురేష్ చెప్పారు. అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసినట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ సురేష్ ఈ చర్యలు తీసుకున్నారు. సదరు ప్రదర్శన నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ చెప్పారు.

ప్రజలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష



89వ వార్డు ఆదర్శనగర్‌లో పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

గోపాలపట్నం : ప్రజల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని, దానికి నిదర్శనమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని ప్రజలు చెబుతున్నారు. జీవీఎంసీ 89వ వార్డు ఆదర్శనగర్‌లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ హెల్త్ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఫీవర్, బీపీ పరీక్షించి ఆయా వివరాలు నమోదు చేస్తున్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి పరీక్షలు చేయడం ఇన్నేళ్లుగా ఎప్పుడూ చూడలేదని స్థానికులు చెప్పుకుంటున్నారు. ప్రజల పట్ల ప్రభుత్వానికి ఇంత ఆదరణ ఉండటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు



సాయిబాబాకు హారతి సమర్పిస్తున్న అర్చకుడు

కంచరపాలెం: స్థానిక 104 ఏరియా బాపూజీనగర్‌లోని షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం అనువంశిక ధర్మకర్త ఎడ్ల శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రధాన అర్చకుడు సూర్యప్రకాష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా విగ్రహానికి భక్తులు క్షీర, విభూది అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం ప్రత్యేక హారతులతో పూజించి, సాయిబాబాను పల్లకీలో ఊరేగించారు. కమిటీ సభ్యులు ఆంజనేయులు, ప్రభాకర్, పైడిరెడ్డి, పనులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శరవేగంగా ఆకర్ష జోన్ పనులు

సీతమ్మధార: అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నక్కవానిపాలెంలోని ఖాళీ స్థలంలో ఆకర్ష జోన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే సీతమ్మధార రైతుబజార్ వరకు రోడ్డు వేసి, మార్కింగ్ చేశారు. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ పరిశీలించి వేగవంతంగా పనులు చేపట్టాలని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు ఆదేశించారు. నక్కవానిపాలెం నుంచి రైతుబజార్ వరకు పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఆకర్ష జోన్ పూర్తయితే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది.

కటిక చీకట్లో తీర ప్రాంతాలు

- సోలార్ దీపాలు శిథిలం కావటంతో అంధకారం
- నిశీథిలో ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు

అందంగా.. ఆహ్లాదంగా సందర్శకులను అలరించిన ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు నేడు అంధకారంతో కళావిహీనంగా మారాయి. ఈ ప్రాంతాలకు వచ్చే సందర్శకులు, ఇక్కడి మత్స్యకారులకు వెసులుబాటుగా ఉండేందుకు సింహాద్రి ఎన్టీపీసీ ఏర్పాటు చేసిన దాదాపు 85 సోలార్ దీపాలు నేడు శిథిలమై వెలగడం మానేసాయి. దీంతో ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు కటిక చీకట్లో బిక్కుబిక్కుమంటున్నాయి.



తిక్కవానిపాలెం తీరంలో శిథిలమైన సోలార్ దీపాలు

పరవాడ : ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల అందాలను ఆస్వాదించడానికి విచ్చేసే సందర్శకుల సౌకర్యార్థం తీర ప్రాంతంలో ఏర్పాటు చేసిన సోలార్ దీపాలు మరమ్మతులకు గురి కావడంతో అంతటా అంధకారం అలుముకుంది. సందర్శకుల సౌకర్యార్థం పై రెండు బీచుల్లో సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సీఎస్సార్ విభాగం ద్వారా గత నాలుగేళ్ల క్రితం లక్షల వ్యయంతో సుమారు 85 సోలార్ దీపాలు ఏర్పాటు చేసింది. అవి రెండేళ్ల వరకు నిరంతరాయంగా వెలిగాయి. అయితే తర్వాత వాటి నిర్వహణ బాధ్యతను ఎవరూ పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు గురయ్యాయి. నిత్యం వెలుగులు విరజిమ్మే తీర ప్రాంతాలు నేడు అంధకారంలో అలమటిస్తున్నాయి. తీరంలో ఉప్పుగాలికి తిక్కవానిపాలెం తీరంలో నిర్మించిన ఇనుప స్తంభాలు తుప్పు పట్టాయి. అలాగే స్తంభాలకు అమర్చిన సోలార్ చార్జింగ్ పలకలు, లైట్లు తుప్పు పట్టి రాలిపోయాయి.

ముత్యాలమ్మపాలెం తీరంలోనూ..

ముత్యాలమ్మపాలెం తీరంలో కూడా సోలార్ దీపాల పరిస్థితి ఇలాగే ఉంది. ఈ రెండు చోట్ల నాలుగైదు లైట్లు మినహా మిగిలిన దీపాలన్నీ పని చేయటంలేదు. ఇసుకలో నిర్మించిన సోలార్ స్తంభాలు నేల కూలుతున్నాయి. సోలార్ లైట్ల స్తంభాలను ఇసుకలో ఏర్పాటు చేయడంతో గాలికి కాంక్రీట్ దిమ్మల చుట్టూ ఉన్న ఇసుక తొలగిపోవడంతో స్తంభాలు నేల కూలడానికి సిద్ధంగా ఉన్నాయి.



ఇసుక తొలగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న సోలార్ స్తంభాలు



లైటు, చార్జింగ్ పలకలు రాలి పోయిన దృశ్యం

రెండేళ్ల క్రితం సోలార్ లైట్ల వెలుగుల్లో జిగేలుమన్న తీర ప్రాంతాలు నేడు కటిక చీకటిలో కూరుకుపోయాయి. దీంతో సందర్శకులతో పాటు స్థానిక మత్స్యకారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇలా కొన్నాళ్లు పని చేసి మూలకు చేరిన సోలార్ లైట్ల మరమ్మతులకు ఎన్టీపీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని సందర్శకులు, గంగపుత్రులు కోరుతున్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



సిద్ధి వినాయకుడిని దర్శించుకుంటున్న వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు, నాయకులు

పరవాడ : రావాడ శివారు రేకవానిపాలెంలో శ్రీ సిద్ధి వినాయక నిమజ్జనోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. పరవాడ వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు సిద్ధి వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోన రామారావు, పార్టీ నాయకులు పల్లా గోవిందు, దాసరి వెంకటరమణ, కె.అప్పలరాజు, ఎం.వెంకటరమణ, కేఎస్ఎన్, రేక కుర్లిబాబు, కె.రామకృష్ణ తదితరులు సిద్ధి వినాయకుడిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు.

- రేకవానిపాలెంలో నిర్వహించిన గణేష్ నిమజ్జనోత్సవాల్లో భాగంగా మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఆ పార్టీ నాయకులు సారిపల్లి జోగినాయుడు, మరిశ అప్పలరాజు, రేక రామారావు, చుక్క తాతారావు, కె.కృష్ణ తదితరులు వినాయకుడిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు.
- వాడచీపురుపల్లి గ్రామంలో గణేష్ నిమజ్జనోత్సవాల్లో భాగంగా సాయిగణేష్ యూత్ ఆధ్వర్యంలో గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వాడచీపురుపల్లి, ఇస్సన్నపేట, ఊటగెడ్డపాలెం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

పలు చోట్ల అన్నసమారాధనలు, నిమజ్జనాలు..

సింహాచలం : వినాయకచవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో గురువారం వాడవాడలా అన్నసమారాధనలు, నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు.

- అడవివరంలోని ఆయిల్‌మిల్ వద్ద గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు కుటుంబ సమేతంగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. రాత్రి నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.వరాహ నరసింహం, గంట్ల కిరణ్, వెంకటేష్, సునీల్, సతీష్, అక్కిరెడ్డి మధు, కొల్లి చిన్నా, మారుతి శ్రీను, గోపి, అను, బంగారం, పండు, ఆకుల నాగరాజు, తులసీరామ్ పాల్గొన్నారు.
- గోశాల నిర్వాసితుల కాలనీలో పోదాలమ్మ, బంగారమ్మ యూత్ ఆధ్వర్యంలో జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వెయ్యి మందికి అన్నసమారాధన నిర్వహించారు. అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నవడ్డన చేశారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు మొగ్గ కిరణ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కర్రి సత్తిబాబు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, డైరెక్టర్ పి.సూరిబాబు, వర్తకులు బంటుబిల్లి సురేష్, కాలనీ నిర్వాసితులు పాల్గొన్నారు.

సింహగిరిపై ముగిసిన పవిత్రోత్సవాలు

సింహాచలం : సింహగిరిపై గడిచిన ఐదు రోజులుగా జరిగిన పవిత్రోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిసాయి. ముగింపుని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఉదయం ఏకాంత స్నపనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. గంగధార జలాలు, పంచామృతాభిషేకాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. వేదపారాయణ చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేదపండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



అప్పన్న ఉత్సవమూర్తులు, చక్రపెరుమాళ్లు

పేకాటరాయుళ్ల అరెస్టు

పరవాడ : మండలంలో పెదముషిడివాడ శివారు విజయరాంపురం గ్రామ పరిసరాల్లో పేకాట శిబిరంపై పరవాడ సీఐ పి.ఈశ్వరరావు తన సిబ్బందితో గురువారం రాత్రి దాడి చేశారు. విజయరాంపురంలో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సీఐ తన సిబ్బందితో దాడులు జరిపి పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, 15 ద్విచక్ర వాహనాలు, రూ.5,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈశ్వరరావు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సింహాచలం : స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని గురువారం పెందుర్తి మండలం పినగాడిలోని వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.జాషువా, విద్యార్థులు, లెక్చరర్లు కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని విద్యార్థులకు ప్రిన్సిపాల్ సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అలాగే సెల్ఫ్ డిఫెన్స్ యాక్టివిటీస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి సెల్ఫ్ డిఫెన్స్ కలిగి, ధైర్యంగా ఉండాలని, ఆ ధైర్యమే మనల్ని మనం కాపాడుకునే విధంగా చేస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి డాక్టర్ కె.జయరావు, పీడీ రమణారావు, వివిధ విభాగాల అధిపతులు, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా, అధ్యాపకులు

మొక్కల సంరక్షణకు చర్యలు



వాకర్స్ పార్కులో మొక్కలు కత్తిరిస్తున్న నిపుణుడు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పర్యవేక్షణలో గురువారం పార్కులోని మొక్కల ప్రూనింగ్, చెత్త, కలుపు మొక్కల తొలగించడం, దోమల నిర్మూలన కార్యక్రమాలు నిర్వహించారు. వాకర్స్ క్లబ్ సభ్యులు సహకరించారు.

విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

అగనంపూడి: దువ్వాడ సమీపంలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు యూజీసీ స్వయం ప్రతిపత్తి మంజూరు చేసింది. విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ అరుంధతి మాట్లాడుతూ పదేళ్ల పాటు గుర్తింపు ఉండేలా యూజీసీ ఉత్తర్వులు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాది నాక్ ఏప్లస్ గుర్తింపు రావడం, మరోపక్క స్వయంప్రతిపత్తి కళాశాలగా ప్రకటించడంలో కళాశాల యాజమాన్యం చొరవ, అధ్యాపకులు, విద్యార్థుల సమష్టి కృషి అభినందనీయమన్నారు. తరువాత కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు, అధ్యాపకులు

'కీప్ లెఫ్ట్' సూచికల ఏర్పాటు



తాటిచెట్లపాలెం హైవేపై కీప్ లెఫ్ట్ మార్క్ వద్ద జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, సీఐ అప్పారావు

మద్రిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి దాటాక తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద కీప్ లెఫ్ట్ లెటర్స్, యారో మార్క్ పెయింటింగ్స్ వేశారు. జాతీయ రహదారిపై అందరూ లేన్ డిసిప్లిన్ తప్పక పాటించి, ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని ఏసీపీ సూచించారు. చిన్న వాహనాలు ఎడమ వైపు ప్రయాణించాలనే విధంగా పెయింటింగ్‌తో వాహన చోదకులకు సూచించారు. బీఆర్‌టీఎస్ రోడ్డుపై కూడా ఈ ప్రక్రియ మొదలుపెడతామని ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. కియా షోరూం సీఈవో శ్రీనివాసరావు, మేనేజర్ నరేష్ సౌజన్యంతో పెయింటింగ్స్ సమకూర్చామని సీఐ చెప్పారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 22 మంది ఎంపిక

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాక్ట్‌సెట్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి 22 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. ఎంబీఏ విద్యార్థులకు ఫ్యాక్ట్‌సెట్ కంపెనీ యాజమాన్య ప్రతినిధులు మనీలా, అనుపమ రంజన్, కిషోర్ కుమార్, వెంకట సత్య కృష్ణ రెండు రోజుల పాటు వివిధ దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలియజేశారు. కళాశాల నుంచి 112 మంది విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనగా 22 మందిని ఎంపిక చేశారని చెప్పారు. రూ.3.4 లక్షల వార్షిక వేతనంతో వీరిని ఎంపిక చేశారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డీన్ బోడే ప్రసాద్, ఎంబీఏ హెచ్‌వోడీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు

అమ్మవారిని దర్శించుకున్న సింహాచలం దేవస్థానం ఈవో

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి అమ్మవారిని వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం (సింహాచలం) కార్యనిర్వహణాధికారి ఎస్. శ్రీనివాసమూర్తి కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు

ముస్లింల శాంతి ర్యాలీ

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులో మహమ్మద్ ప్రవక్త జన్మదినం ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మద్రిపాలెం మస్జిద్ ఈ అల్ ఫతా, జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో నాతేకలంలు ఆలపిస్తూ ముస్లిం మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ చేశారు. పాత పోస్టాఫీస్ వద్ద ఇసాక్ మదీనావలీ మజార్ షరీఫ్ వరకు ర్యాలీగా వెళ్లి మజార్ వద్ద చాదర్(పవిత్ర వస్త్రం) సమర్పించామని కమిటీ సభ్యులు తెలిపారు. అంతకముందు ముస్లింలు మసీద్ ప్రాంగణంలో ఖురాన్ పఠించి, నమాజ్ చదివి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

డ్రైనేజీ పనులకు మార్కింగ్

సింహాచలం : జీవీఎంసీ 95వ వార్డు పరిధి గవరపాలెంలో డ్రైనేజీ పనులకు గురువారం కొలతలు తీసుకున్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ అవుట్‌లెట్ లేక వర్షం వస్తే ముంపునకు గురవడం, ఇళ్లలోకి నీరు వచ్చే పరిస్థితులు ఉండేవి. ఈ సమస్యపై 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఇటీవల జీవీఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా రైల్వేకి సంబంధించిన స్థలం కావడంతో అనకాపల్లి ఎంపీ సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సారధ్యంలో రైల్వే అధికారుల దృష్టికి సమస్యని తీసుకెళ్లారు. రైల్వే డిపార్ట్‌మెంట్ ఎస్టిమేషన్ ప్రకారం జీవీఎంసీ నుంచి 38 లక్షల రూపాయలు రైల్వే డిపార్ట్‌మెంట్‌కి గతంలో చెక్కు అందజేశారు. దీంతో సంబంధిత పనులకు మార్గం సుగమమైంది. దీంతో సంబంధిత మార్కింగ్ పనులను రైల్వే అధికారుల సమక్షంలో నిర్వహించారు. పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో రైల్వే ఐవోడబ్ల్యు ఎస్.వి.రమణ, కాంట్రాక్టర్ ఎస్.గోవింద్, సైట్ ఇన్‌చార్జి ముఖేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పులమరశెట్టి లక్ష్మణ్, బొడ్డేటి జగదీష్, పులమరశెట్టి పోలయ్య, పులమరశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులకు మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

జాగృతి సంస్థ 6వ సర్వసభ్య సమావేశం

సబ్బవరం: సబ్బవరంలోని జాగృతి సంస్థ 6వ సర్వసభ్య సమావేశం ఆ సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సంస్థ ఎండీ కె. సుజాత సంస్థ వార్షిక నివేదికను విశిష్ట అతిథి ఉద్యానశాఖ అధికారి జి. ప్రభాకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథి మాట్లాడుతూ అమృతఫల కంపెనీ వాణిజ్యపరంగా ముందుకెళ్లాలని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సంస్థ ఎండీ సుజాత మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకులు స్వర్గీయ కందర్ప రామకృష్ణ రైతుల సంక్షేమానికే కృషి చేశారన్నారు. ఆయన ఆశయాల మేరకు ఆవిర్భవించిందే అమృతఫల కంపెనీ అన్నారు. ఈ కార్యక్రమంలో అమృతఫల కంపెనీ చైర్మన్ వెన్నెల అప్పలనాయుడు, వైస్ చైర్మన్ మజ్జి అప్పలనాయుడు, రేసుపూడి రమణ, అప్పారావు, గంర్రెడ్డి అప్పారావు, బలిరెడ్డి సూరీడమ్మ, సిబ్బంది, వివిధ కంపెనీల సీఈవోలు పాల్గొన్నారు.



సంస్థ వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న అతిథులు

మార్మోగిన గోవింద నామస్మరణ

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గిరి ప్రదక్షిణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభించిన ప్రదక్షిణలో భక్తుల గోవింద నామస్మరణతో గిరి మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువ జామున వెంకటేశ్వరస్వామికు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వ పథకాలు

విశాఖ విద్య: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రవాస్ యోజన ఇన్‌చార్జి పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేపీ ఎన్ఏడీ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు గొట్టివాడ వెంకటేశ్వరరావు నేతృత్వంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, మండల బాధ్యులతో ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పురుషోత్తమ్ రమేష్, చంద్రశేఖర్ రాజు, సురేష్, కృష్ణారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాలయంలో లలితా పారాయణ పఠనం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలోని శ్రీకృష్ణాలయంలో గురువారం స్థానిక మహిళలు లలితా పారాయణం చేశారు. శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 20 మంది మహిళలు, 12 మంది చిన్నారులు శ్రీకృష్ణుడి గీతాలు ఆలపించారు. అనంతరం గోవింద నామాలు, లలితా పారాయణ, విష్ణు పారాయణ చేశారు.

జాషువాకు ఘన నివాళి



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్య అతిథులు, నాయకులు, సంఘ సభ్యులు

కంచరపాలెం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం జాషువానగర్‌లోని జాషువా కళా ప్రాంగణంలో ఆయన విగ్రహానికి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు పూర్వ వీసీ ఆచార్య జార్జ్ విక్టర్, అంబేడ్కర్ మిషన్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణ్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జార్జ్ విక్టర్ మాట్లాడుతూ కుటిల కులతత్వం, మతోన్మాద దారిద్ర్యంపై స్వానుభవం ఉన్న గుర్రం జాషువా వాటిని రూపుమాపేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా వృద్ధులకు వండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.అప్పారావు, టీడీపీ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, యాదవ సంఘం ప్రతినిధి నమ్మి అప్పల సత్యనారాయణ, కళా ప్రాంగణం గౌరవ అధ్యక్షుడు గొటువాడ నర్సింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, కార్యదర్శి గుమ్మడి ఆదినారాయణమూర్తి, కోశాధికారి గుమ్మడి అచ్చిబాబు, జి.వి.రమణ, నాయకులు సోడదాసి సుధాకర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు కణితి సాధురావు పాల్గొన్నారు.